# జీవితానికి నిర్వచనం!

మనస్సుకు సంబంధించిన సంతోషాన్ని ముఖం భరించగలదన్న విషయం ఆనాటి వరకూ నాకూ తెలీదు.

స్టేషన్లోకి రైలు వచ్చిందనుకొని ఆతృతగా విజయవాడ వంతెన ఎక్కుతున్నప్పుడు, చివరి మెట్టు మీద రఘురామారావు కన్పించాడు. మొదట ఆశ్చర్యమేసింది. అతను ఖర్గపూర్‌లో పనిచేస్తున్న విషయమే తెల్సు నాకు. ఇంతలో ఇక్కడికెలా వచ్చాడని పలకరిస్తే నవ్వాడు. ఆ నవ్వు కాకపోతే అతనిలో నన్ను ఆకర్షించింది ఏదీ లేదనిపిస్తుంది. ప్రత్యేకమైన శ్రద్ధతో తయారు చేసిన దంతపు బొమ్మలాగా, సగం వరకూ బట్టతలా – ఆ ఆరోగ్యానికి, అందానికి ఈర్ష్యే కలుగుతుంది.

"ఏం రఘురామారావ్?" అన్నా

మాట్లాడలేదు. నా వెనకే మళ్ళీ స్టేషన్లోకి నడుస్తున్నాడు. నాకంతా రైలుమీదే దృష్టి. అయినా ఏదో మాట్లాడాలి : "నీమీద నాకు చాలా కోపంగా ఉంది."

మొదట అర్థంకాలేదు రఘురామారావుకి, తెల్లబోయి చూశాడు.

"ఎందుకని?"

"ఉత్తరాలు రాయలేదని –"

నవ్వి ఊరుకొన్నాడు.

"నువ్వు తండ్రివి కాబోతున్నట్టు మొన్న నాకు హనుమంతరావు చెప్పాడు. నువ్వు ఉత్తరం రాస్తే పెద్ద జవాబు రాయాలని సిద్ధంగా కూచున్నాను." అన్నాను.

ఇంకా మాట్లాడడంలేదు రఘురామారావు – నేను పెట్టె, బెడ్డింగుతో, నడవలేక పోవడం చూసి పెట్టె అందుకున్నాడు.

"ఊరుకున్నావేం? – పోనీ, నీమీద కోపం లేదులే. కొడుకు పుట్టాడంటే ..."

"ఏ రైలుకి వెళ్తారు మీరు ..."

ఇప్పటికి అతని ముఖంలోకి చూచాను. ఆ విషయాల్ని దాటేసే ప్రయత్నం కన్పించి తెల్లబోయేను. ముఖంలో నీరసం, దిగులూ, అయినా ఏదో జ్ఞాపకాన్ని దాచుకొనేందుకు కళ్లు చేస్తున్న ప్రయత్నం – రఘురామారావులో ఏదో మార్పు కన్పించింది. చటుక్కున ఆగి చెయ్యి పట్టుకున్నాను.

"ఏం జరిగింది చెప్పు?" అన్నా మెల్లగా.

ఒక్కసారి నా ముఖంలోకి చూచాడు. ఏదో చెప్పాలని ప్రయత్నం – పెట్టెను రెండో చేతిలోకి మార్చుకుని. "ఈసారి కూడా కొడుకు పుట్టి పోయాడండి" అన్నాడు విన్పించీ విన్పించనట్టు.

తల మీద పిడుగు పడ్డట్టయింది. ఒక్కసారిగా నిర్ఘాంతపోయి ఆగి పోయేను.

రఘురామారావుకు ఇది ఆరేళ్ళ శాపం. ఆరేళ్ళ క్రిందట మొదటి సారిగా తండ్రి కాబోతున్నాడనుకున్న సంగతి మాకు తెలియచెయ్యడానికి అతను చేసిన హడావుడి – ఇప్పటికీ గుర్తే. మరీ చిన్నతనం. అప్పట్లో ఏమైనా అది సంతోషించదగ్గ విషయమే. కాని మరి ఆ[illegible]లకి ఫలితం కూడా తెలిపోయింది. కూతురు పుట్టి చచ్చిపోయింది. నాలుగు రోజులు విచారంగా కన్పించినా ఆ తర్వాత తేరుకున్నాడు రఘురామారావు.

"పోనీండి, చిన్న వయస్సులో అనుభవం" అన్నాడు కొన్నాళ్ళకి.

అయితే ఈ దుర్ఘటన అక్కడితో ఆగలేదు. పరంపరగా మరి రెండు సార్లు జరిగేసరికి రఘురామారావు భయపడిపోయాడు. మూడోసారి కూడా కొడుకు పుడుతూనే పోయేసరికి అందరికీ ఆశ్చర్యమేసింది. డాక్టర్లందరినీ కారణ మేమిటని అడిగాడు. భార్యను వీలయినంత పరీక్షలు చేయించాడు. మద్రాసు వెళ్తే ఇద్దరి రక్తంలో ఏవో తేడాలున్నాయన్నారు. దాదాపు ఆరు నెలల నుండి అయిదువందల ఖర్చుతో ఇద్దరూ చికిత్సలు చేయించుకు వచ్చారు. అప్పటికి ఇంకా బలంగా తయారయ్యాడు రఘురామారావు. "ఇంక బాధలేదండి. ఈసారి కొడుకుతో మీ దగ్గరికి వస్తాను ... మేమిద్దరం ఆరోగ్యంగా ఉన్నాం" అని పదకొండు నెలల క్రితం ఉత్తరం రాశాడు. నిజంగా చాలా సంతోషించాను. కొడుకుని ఎత్తుకోవటమే లక్ష్యంగా తయారయింది రఘురామారావుకి.

కాని ఇప్పుడు తీరా ఈ వార్త వినేసరికి మనస్సు చివుక్కుమంది. "అయ్యో పాపం!" అనుకొన్నాను.

మెల్లగా అన్నాడు మళ్ళీ: "నిన్ననే కొడుకు పుట్టి పోయాడు. మా ఆవిడ ఇంకా

ఆసుపత్రిలోనే ఉంది, మనస్సేం బాగా లేదు. రిలీఫ్ కోసం ఇలా వచ్చాను. వెళ్ళి ఆమెకు భోజనం తీసుకెళ్ళాలి"

ముప్ఫై ఏళ్ళ జీవితంలో నలుగురు పిల్లల్ని పోగొట్టుకున్న అతన్ని చూస్తే మనస్సు "జివ్వు" మంది. జాలేసింది.

"అరెరె! ఎంతపని?" అన్నాను.

ఇంకేం మాట్లాడాలో తెలీదు. ఇంకా పాత విషయాలే ఆలోచిస్తున్నాను. ఇంత విన్నాక రఘురామారావు ముఖం చూస్తే మరో పది ఏళ్ళు ముసలివాడయి పోయి నట్టనిపించింది. నాలో ఆశ్చర్యాన్ని చూసి మళ్ళీ నవ్వుతాడు.

"ఏం చెయ్యమంటారు? స్త్రీని కోరడమే పాప మనిపిస్తోందిక" అన్నాడు.

ఆ మాటల్ని ఎన్నాళ్ళు కూడదీసుకొని అంటున్నాడో అర్థమయింది.

"ఇంట్లో అంతా చాదస్తం – అత్తగారు, మామగారు అంటే – నా మగతనం మీదా, నా నడవడిమీదా నమ్మకం పోయింది. ఓ పక్క ఈ బాధ, మరోపక్క భార్య ఏడుపుకూ తోడు – నేరస్థుణ్ని లాగ నన్ను వాళ్ళు చూసే చూపులు కోతపెట్తాయి. నాది కాని శిక్షని అనుభవిస్తుననట్లు – నాలో తప్పు లేదని ఎల్లా నిరూపించుకోవడం మీరే చెప్పండి" –

మాటలు పెగలడం లేదు. భుజంమీద చెయ్యేసి "రఘురామారావు! – ఇది నీ శక్తికి మించిన కష్టం, నేనే అయితే ఏం చేస్తానో తెలీదు" అన్నాను.

రైలు లేటయింది. ఇంకా పదినిముషాలు వేళ ఉంది.

రఘురామారావు ఏదో మాట్లాడుతున్నాడేగాని, నా ఆలోచనలన్నీ వేరేదారి వెదుక్కుంటున్నాయి.

"ఈసారి మీ ఊరు వస్తానండి – ఒంటరిగా రావాలనుంది – సమ్మర్‌లో వచ్చివుంటాను" అన్నాడు.

"తప్పకుండా రా!" అని ఆహ్వానించాను.

రైలు ఇంకో క్షణంలో వస్తుందనగా అతని చేతిలో ఉన్న పుస్తకాన్ని గమనించాను.

ఇంతవరకూ ఆ పుస్తకాన్ని చూడలేదు నేను.

"ఏమిటది?" అన్నాను.

నవ్వేడు. పుస్తకం చేతిలోంచి తీసుకొని విప్పాను. కాగితం తిరగేస్తూనే దాని మీద శీర్షిక చూసి నిర్ఘాంతపోయేను – "పిల్లల పెంపకం – రోగనివారణ"

నేను ఆశ్చర్యపోతే ముఖం చూసి నవ్వేడు.

"ఆశపోదు – కొడుకుని ఎత్తుకోవాలని ఉంటుంది" అన్నాడు విన్పించీ విన్పించనట్టుగా.

—————